క్లుప్తంగా

బహుమతుల ప్రదానం



జడ్చర్ల టౌన్: బాక్సింగ్ డే పురస్కరించుకుని యంబీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల విజేతలకు గురువారం రాత్రి బహుమతులు అందజేశారు. ఉత్కంఠభరితంగా సాగిన వాలీబాల్ ఫైనల్‌మ్యాచ్‌లో నతానియల్ జట్టు విజేతగా నిలవగా సల్మాన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. క్రికెట్ విభాగంలో జడ్చర్ల టైగర్స్ యాకూబ్ జట్టు విజేతగా, క్రిస్టియన్‌కాలనీ సాంసన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. చెస్‌లో రాజు ప్రథమస్థానం, దీపక్ ద్వితీయ స్థానం పొందారు. క్యారమ్స్‌లో ప్రసన్న మొదటి స్థానం, హేమ ద్వితీయ స్థానం సాధించింది. విజేతలకు రాత్రి పొద్దుపోయాక యంబీ చర్చి ఆవరణలో రెవ కె. విలియంబూత్, స్టీవెన్‌రాజ్, సంఘ చైర్మన్ ఫిలిమోన్, కార్యదర్శి తిమోతి, యూత్ చైర్మన్ సుస్మిత్‌లు షీల్డులు అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దేవరకద్ర: మండల కేంద్రంలో మాజీ మార్కెట్ చైర్మన్ దొబ్బలి ఆంజనేయులు తల్లి లక్ష్మమ్మ మృతి చెందడంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుంటుంబాన్ని పరామర్శించారు. అదే విధంగా దేవరకద్రకు చెందిన పొట్టలి హన్మంతరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. లక్ష్మీపల్లిలో మాడెమోని ఈరమ్మ మృతి చెందడంతో గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహిళ అదృశ్యం



అనిత (ఫైల్)

నవాబుపేట: మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. రుద్రారం గ్రామానికి చెందిన ఈసూరి అనిత(22) ఈ నెల 26న ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి తన ఇద్దరు పిల్లలను ఇంట్లోనే వదిలేసి వెళ్లిపోయింది. ఆలస్యంగా మేలుకున్న అత్త పిల్లల ఏడుపులు విని గదిలోకి చూడగా, అనిత కనిపించలేదు. ఆ సమయంలో ఆమె భర్త కూడా లేడు.ఆమె భర్త సత్యనారాయణ ఈ నెల 25న శబరికి వెళ్లాడు. ఈ విషయం తెలిసిన వెంటనే సత్యనారాయణ మార్గమధ్యలో నుంచి వచ్చి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిడ్జిల్: మండలంలోని మల్లాపూర్‌లో మహేష్ అనే వ్యక్తి 8 క్వింటాల రేషన్ బియ్యాన్ని శుక్రవారం ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా, పట్టుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. మండలంలో అక్రమ వ్యాపారం కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాలపై చర్య తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తోందని, శుక్రవారం ప్రభుత్వం సెలవు ప్రకటించినా యాజమాన్యం పాఠశాల నిర్వహించారని వెంటనే పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎంఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తిక్ మాట్లాడుతూ పాఠశాల తెరిచిన విషయాన్ని జిల్లా అధికారులకు ఫోన్ ద్వారా చెప్పినా స్పందన లేదని, అనుమతి లేకుండా పక్క భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అడ్డాకులలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మూసాపేటలో..



మిడ్జిల్‌లో మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలుపుతున్న నాయకులు

ఆర్థిక సంస్కరణల సారథికి నివాళి



గార్లపహాడ్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని పలువురు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలో, భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట, దేవరకద్ర, జడ్చర్ల, నవాబ్‌పేట, గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో, ఆయా గ్రామాల్లో మన్మోహన్ సింగ్ చిత్రపటాలు ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రధాన కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



భూత్పూర్ చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గండేడ్‌లో..



దేవరకద్రలో మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మహమ్మదాబాద్‌లో మన్మోహన్‌సింగ్‌కు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



హన్వాడలో మాజీ ప్రధానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాలోత్సవంతో విద్యార్థులకు మానసికోల్లాసం



బాలోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బాలోత్సవం కార్యక్రమంతో పాఠశాల విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన బాలోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతి సంవత్సరం కొత్త ఉత్సాహంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తున్నామన్నారు. వివిధ విభాగాల్లో ఏర్పాటు చేసిన స్టాళ్లు, వివిధ ప్రదర్శనలతో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొనడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, డాక్టర్ ప్రతి, బాలోత్సవ్ అధ్యక్షుడు బెక్కం జనార్దన్, టీపీసీసీ కార్యదర్శి వినోద్‌కుమార్, ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

- ఆభరణాల ఊరేగింపు



ఆభరణాల ఊరేగింపు

జడ్చర్ల టౌన్: పట్టణ శివారులోని గంగాపురం రోడ్డులోని జ్ఞానసరస్వతి సహిత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. కాలేజీరోడ్డులోని అనుపరఘు ఇంటి నుంచి తిరు ఆభరణాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అయ్యప్పనామస్మరణ మధ్య ఆభరణాల ఊరేగింపు ప్రారంభించారు. ఊరేగింపు సందర్భంగా చిన్నారులు, మహిళలు కోలాటాలు, స్వాముల నృత్యాలతో ముందుకు సాగారు. ఆభరణాలు మోస్తున్న వారికి పాదాలను నీళ్లతో కడుగుతూ మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. బాణాసంచా పేలుస్తూ ముందుకు సాగారు. ఊరేగింపు సందర్భంగా వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన పూజలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొని కొద్దిసేపు ఆభరణాలు మోశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వార్డుకౌన్సిలర్లు ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపు సందర్భంగా సీఐ ఆదిరెడ్డి నేతృత్వంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఊరేగింపు అనంతరం మూలవిరాట్‌కు వాటిని అలంకరించి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. పట్టణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. రాత్రి 7గంటలు దాటాక ఆలయ ప్రాంగణంలోని మెట్లవద్ద మహాపడిపూజ నిర్వహించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

నవాబుపేట: మండలంలోని రుక్కంపల్లిలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాజు స్వామి ఆధ్వర్యంలో, గురుస్వామి వెంకటేష్ చేతులమీదుగా పూజా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో వివిధ గ్రామాలకు చెందిన గురుస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

హన్వాడలో పారిశుద్ధ్య కార్మికుల ర్యాలీ



హన్వాడ/కోయిల్‌కొండ: పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ పారిశుద్ధ్య కార్మికులు తెలంగాణ టీయుసీఐజేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్మిక సంఘం నాయకులు మాట్లా డుతూ ప్రభుత్వం బకాయిపడ్డ పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశా రు. మల్టీపర్పస్ విధానాన్ని అమలుచేస్తూ జీఓ 51ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బాలకిష్టయ్య, టీయూసీఐ రాష్ట్ర సహా య కార్యదర్శి వెంకటేష్, నాయకులు రాము లు, రంగయ్య, తిమ్మన్న, చెన్నయ్య, కృష్ణయ్య, తిర్పతయ్య, శ్రీను, దస్తయ్య, శ్రీశైలం, ఆంజనేయులు, బాలకిష్టయ్య పాల్గొన్నారు .

- కోయిల్‌కొండ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్‌యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎదిరింటి నర్సింహులు కోరారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి టోకెన్ సమ్మె నిర్వహించారు. అంతకు ముందు వివేకనందచౌరస్తాలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీనునాయక్, చెన్నయ్య, వెంకటయ్య, గోపాల్, బాలకృష్ణ, కురుమూర్తి, రాందాస్, వడ్డెన్న, లక్ష్మమ్మ, చెన్నయ్య, అంజి పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన వాయిదా

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లాలో శనివారం నుంచి జరగాల్సిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన వాయిదా పడింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అకాల మరణంతో విద్యాశాఖ అధికారులు వైజ్ఞానిక ప్రదర్శనను వాయిదా వేశారు. ప్రభుత్వ వారం రోజులపాటు సంతాప దినాలు పాటించడంతో 28, 29న జరగాల్సిన ప్రదర్శనను వాయిదా వేశామని, ఎప్పుడు నిర్వహించేది త్వరలో తేదీలు వెల్లడిస్తామని డీఈఓ గోవిందరాజులు తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక

- నేటి నుంచి అబ్దుల్ ఖాదర్‌షా దర్గా 86వ వేడుకలు
- 29న భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



విద్యుత్ దీపాల వెలుగులో దర్గా

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌షా రహెమతుల్లా అలై దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. అబ్దుల్‌ఖాదర్‌షా దర్గా ఉర్సుకు ఘనమైన చరిత్ర ఉంది. సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌షా మజ్‌జూబ్ ఓ సాధారణ పోలీస్ కానిస్టేబుల్. 1929లో కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డ నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడినట్లు ముస్లిం పెద్దలు చెప్పారు. ఆయన తన విధులను నిర్వహిస్తూనే దైవ చింతన, ఆధ్యాత్మిక భావనతో ప్రజల్ని చేరదీసేవారు. తన పదవీ విరమణ అనంతరం ఆయన జిల్లా కేంద్రంలోని రాయచూర్ రోడ్‌లో ఓ చెట్టుకింద కూర్చొని ప్రజలకు హితబోధ చేసేవారు. ప్రతి గురు, శుక్రవారాలు ఖాదర్‌షా వద్దకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి తమ బాధలు, సమస్యల్ని విన్నవించుకునేవారు. వారి సమస్యలకు ఆయన పరిష్కార మార్గాలను చెప్పేవారని తెలిసింది. ఖాదర్‌షా మరణానంతరం అతని ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు 1939లో రాయచూర్ రోడ్డు పక్కన నిర్మించిన ఆయన సమాధిపై ఓ దర్గాను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దర్గాను కులమతాలకతీతంగా ప్రజలు దర్శించుకుంటున్నారు.

నేటి నుంచి ఉర్సు

అబ్దుల్‌ఖాదర్‌షా దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాత్రి 8 గంటలకు జలాభిషేకం (గుసుల్ షరీఫ్) నిర్వహించనున్నారు. 29న వేడుకల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవం నిర్వహిస్తారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు గంధోత్సవం షేక్ బడేసాబ్ ఇంటి నుంచి బయలుదేరి అశోక్‌టాకీస్ చౌరస్తా, ఎస్‌బీహెచ్ రోడ్డు తూర్పుకమాన్, వన్‌టౌన్ చౌరస్తా వీధుల మీదుగా దర్గా వరకు చేరుకుంటుంది. అనంతరం దర్గాలో చాదర్లు, పూలు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు అందజేస్తారు. 30న దీపారాధన (చిరాగా) వేడుకలు, 31న జ్యారత్ ఫాతేహాతో దర్గా ఉత్సవాలు ముగుస్తాయి.

ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. 28న జామియ నిజామియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు ముఫ్తి ఖలీల్ అహ్మద్, జియావుద్దీన్ ఖాద్రీలను సన్మానిస్తాం. 29న వేడుకల్లో సైపుల్లా, కర్నూల్‌కు చెందిన పీర్ హుస్సేన్, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాష, గుల్బర్గాకు చెందిన హయతుల్లా బాషా ఖాద్రీ పాల్గొంటారు. 30న హైదరాబాద్‌కు చెందిన వాహెద్ నియాజీ ఖవ్వాలి బృందం ఉత్సవాల్లో ఖవ్వాలి ఆలపించనున్నారు. 31న ఫాతేహా రోజు రిజ్వాన్‌పాష ఖాద్రీ తదితరులు హాజరవుతారు.

– మహ్మద్ అబ్దుల్ జమీర్‌ఖాద్రీ

ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు టీటీడీ అనుమతి



సీఐ,ఎస్‌ఐలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: టీటీడీ(తిరుమల తిరుపతి దేవస్థానం)లో తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సిఫారసు లేఖలను అనుమతిస్తూ టీటీడీ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫారసు లేఖలను నిలుపుదల చేశారని పేర్కొన్నారు. తాను ఇటీవల స్వామి దర్శనానికి వెళ్లిన సమయంలో ఈ విషయంపై మాట్లాడినట్లు గుర్తు చేశారు. ఈ మేరకు టీటీడీ వారానికి రెండు సార్లు తమ లేఖలను అనుమతిస్తూ నిర్ణయం వెలువరించడం శుభపరిణామమని పేర్కొన్నారు.

అస్వస్థత ప్రయాణికుడికి ఎమ్మెల్యే చేయూత

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడికి అకస్మికంగా ఫిట్స్ వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆ దారిలో వెళ్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందించి తన పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి తరలించిన సంఘటన శుక్రవారం జడ్చర్ల–మిడ్జిల్ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు ఫిట్స్ రావడంతో డ్రైవర్ బస్సును పక్కకు ఆపాడు. ఆ సమయంలో మిడ్జిల్ నుంచి జడ్చర్లకు వస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఈ విషయం తెలుసుకుని బస్సులోకి వెళ్లి అతనిని వెంటనే వైద్య చికిత్స కోసం ఎస్కార్ట్ వాహనంలో తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ చేపట్టండి

ఈనెల 31న రాత్రి కొత్త సంవత్సరం రోజున డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. రంగారెడ్డిగూడలోని ఆయన నివాసంలో ఆయన పోలీసులతో సమావేశమయ్యారు. కొత్త సంవత్సరం రోజు కేక్‌లు కట్ చేయడం, స్వీట్లు పంచుకోవడం, దైవ ప్రార్థనలు చేసుకోవడం వంటివి చేయాలని ప్రజలకు సూచించారు. మద్యం తాగి రోడ్లపైకి వచ్చి ప్రమాదాల బారిన పడొద్దని కోరారు. సమావేశంలో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐలు చంద్రమోహన్, శివానంద్‌గౌడ్, ఎస్‌ఐలు రవి, తిరుపతి, శివనాగేష్ ఉన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే

జడ్చర్ల టౌన్: భారతదేశ ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహానుభావుడు మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో దివంగత నేత మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

- ఏడాదిన్నరగా నిలిచిన పోల్కంపల్లి రోడ్డు పనులు
- కంకర వేసి వదిలేయడంతో వాహనదారుల కష్టాలు
- దుమ్ముతో వ్యాధులకు గురవుతున్నామని ఆవేదన

దుమ్ము రేగుతోంది!



తాళ్లగడ్డ వద్ద నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి రోడ్డు దుమ్ము రేగుతోంది. రోడ్డుపై కంకర పరిచి వదిలేయడంతో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఒక వాహనం ముందు వెళ్లిందంటే చాలు దాన్ని వెనకాల వచ్చే వాహనదారులు దుమ్ముతో ఇబ్బంది పడాల్సిందే. ఏడాదిన్నర నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు పనులను పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

మొదలుపెట్టి.. వదిలేసి..

44వ నంబర్ జాతీయ రహదారి నుంచి పోల్కంపల్లి వరకు బీటీ రెన్యువల్ కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రహదారి నుంచి పోలకంపల్లి వరకు బీటీ రెన్యువల్, పోల్కంపల్లి–కమాలుద్దీన్‌పూర్ దారిలో వాగుపై బ్రిడ్జి, జానంపేట–తాళ్లగడ్డ దారిలో చెరువు కట్ట వద్ద బ్రిడ్జి కోసం మూడు పనులకు కలిపి సుమారు రూ. 6.35 కోట్లను కేటాయించింది. ఇందులో ఎంఆర్‌ఆర్ కింద మంజూరైన రూ. 90 లక్షలతో 2023 ఏప్రిల్ 10న బీటీ రెన్యువల్ పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డుపై పోల్కంపల్లి వరకు కంకర వేసి వదిలేశారు. అప్పటి నుంచి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు వెళ్లినప్పుడు వచ్చే దుమ్ముతో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై దుమ్ము రాకుండా ట్యాంకర్‌తో నీళ్లను పోయిస్తున్నా పెద్దగా ఫలితం ఉండటం లేదు. ఇదిలా ఉంటే, కమాలుద్దీన్‌పూర్ బ్రిడ్జి పనులు దాదాపుగా పూర్తి కాగా.. తాళ్లగడ్డ బ్రిడ్జి పని అసంపూర్తిగా ఉంది.



కంకర పరిచి వదిలేసిన పోల్కంపల్లి రోడ్డు

పనులు ప్రారంభిస్తాం..



హైవే నుంచి పోల్కంపల్లి వరకు ఉన్న రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇందులో కొంత సీసీ పనులు పూర్తి చేయించాం. నిలిచిపోయిన రోడ్డు పనులను త్వరలోనే మొదలుపెట్టిస్తాం. అసంపూర్తిగా ఉన్న తాళ్లగడ్డ బ్రిడ్జి పనులను కూడా పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణ్‌గౌడ్, పీఆర్ డీఈ